
# అపర ధర్మరాజు శేఠ్ జీ

ద్రోణంరాజు కృష్ణమోహన్

సేఠ్ ధర్మచంద్ శాంతారాం నిజంగా ధర్మప్రభువు. శాంతమూర్తి. అందులో ఏమీ సందేహంలేదు. వారానికోసారి వీలునుబట్టి శనివారమో, ఆదివారమో, వంశ సంప్రదాయం ప్రకారం పేదవాళ్ళని పోగుచేసి, పొద్దున్నే దమ్మిడీలు పంచుతూ వుంటాడు. ఇక కొట్లో మాట్లాడటానికి, వ్యాపారం పనిమీద, వచ్చేవారితోను ఎంత శాంతంగా మాట్లాడుతాడో ఆ భగవంతునికే తెలియాలి, ఆ మాట్లాడిన మనిషికే తెలియాలి. అతని ఇతర వ్యాపారాల సంగతి అలా వుంచండి, ఎందుకంటే బట్టల దుకాణంలో పెద్ద కొడుకుని, హోటల్ లో రెండోవాడిని వుంచేశాడు. పోతే తను మాత్రం ఆ లక్ష్మీదేవి నిరంతరం తన కటాక్షవీక్షణాలు ప్రసరింప జేసే వడ్డీ వ్యాపారపు కొట్లో కూర్చుంటాడు.




ఆ కొట్టు తప్ప మరోదాంట్లో ఒక్క క్షణం కూర్చోడు. దానికీ అతనికీవుండే సంబంధం అలాంటిది. ఆ కొట్టుమీదే జీవితం ప్రారంభించాడు. పాతికేళ్ళలో నగరంలో అత్యాధునికమైన ఇంగ్లీషు పద్ధతి హోటలు, రకరకాల దేశీయ, విదేశీ వస్త్రాలతో నిండే పెద్ద బట్టల దుకాణం పెట్టగలిగాడంటే అతని సంపాదనని ఆలోచించండి. కనుక ఇతర దుకాణాల సంగతి వదిలేసి వడ్డీదుకాణం సంగతి చూద్దాం.

సేఠ్ ధర్మచంద్ శాంతారాం ఒకరోజు పొద్దున్నే దుకాణం తెరుస్తున్నాడు. అప్పటికి యింకా గుమాస్తా లిద్దరూ రాలేదు. హడావిడిగా ఒక పాతికేళ్ళ యువకుడు పరుగెత్తుకొచ్చాడు. ధర్మచంద్ దగ్గర నుంచున్నాడు. చాలా ఖంగారుగా వున్నాడు. చేతిలో ఒక చిన్న మూట వుంది.

"మీరేనా సేఠ్ ధర్మచంద్ శాంతారాం?"

"అవును బాబూ ఏంకావాలి?" తాళం తీసి లోపలి కెడుతూ అన్నాడు.

"చాలా అర్జంటు పని."

"రా బాబూ...కూర్చో."

"కూర్చోడానికి రాలేదు. ముందు యీ గొలుసు తీసుకొని వెంటనే 150 రూపాయ లిప్పించండి" అని బైటకు తీశాడు. ఆ యువకుని మొహం జాగ్రత్తగా పరీక్షించాడు ధర్మచంద్. చాలా అమాయికుడులా వున్నాడు. నమ్మదగినవాడే. దొంగవస్తువు కాదు.

"రెండువందలుంటుంది దీని విలువ బహుశా. దానికి 150 యివ్వడం ఆచారం లేదే! పోనీ 130 పట్టుకెళ్లు."

"లేదు. క్షమించండి. చాలా అవసరం. మా యింటికి ఒక బంధువొచ్చాడు. ఆయన 150 రూపాయలకట్ట చేతికిచ్చాడు రాత్రి దాచమని. తెల్లవారి చూస్తే లేదు. మా తమ్ముడు ఒక దొంగ వెధవలెండి. వాడిపనే. పారిపోయాడు. ఆ బంధువు పెందలకాడే భోంచేసి వెడతాడు. మా గౌరవం రక్షించండి." ప్రాధేయపడ్డాడు. సేఠ్ ధర్మచంద్ శాంతారాం జాలిహృదయం కలవాడని పైనే చెప్పానుకదూ. వెంటనే తీసి యిచ్చేశాడు. రసీదు వ్రాయబోతున్నాడు.

"అక్కర్లేదు. ఉంచండి. మళ్ళీవచ్చి తీసుకుంటాను. మీ దగ్గర రసీదుకూడా ఎందుకు?" అని ఆ నోట్లు జేబులో కుక్కుకుని పరుగెత్తాడు. ధర్మచంద్ నవ్వుతున్నాడు.

* * *

పదిరోజులు గడిచాయి. ఆ యువకుని జాడ తెలియలేదు. ధర్మచంద్ కి ఏమాత్రం ఆందోళన లేదు. ఎందుకంటే ఇటువంటివి అతని అనుభవంలో చాలా జరిగాయి. అతని నిజాయితీని గుర్తించిన ఆ చుట్టుపక్కల రెండుమూడు పేటల్లోనూ సాధారణంగా ఎవరూ రసీదులు తీసుకోనే తీసుకోరు. ఎవరెవరికి ఎంతయిచ్చిందీ, ఎటువంటి నగలు తీసుకున్నదీ వేరే ఒక నోట్ బుక్కులో వ్రాసుకుంటాడు. నగలలో ముక్కలు కానేయడం, అతుకులు

పెట్టడం. వస్తువులు మార్చడం అతనికెప్పుడూ అలవాటు లేదు.

నెల్లాళ్ళు గడిచాయి. ఆ యువకుని జాడ తెలియలేదు. ఎడ్రసుకూడా చెప్పిపోలేదు. సేర్‌జీకి ఆశ్చర్యం కలిగింది. ఆ ఉదయం జరిగిన సంఘటన మాత్రం గుర్తుగా వ్రాసుకున్నాడు. ఒకరోజు అనుకోకుండా సాయంత్రంవేళ ఆ యువకుడు ప్రత్యక్షమైనాడు. ఆరోజు ఆ కొట్టు మూసివేయాల్సి వున్నది. వీధివైపు గుమ్మంమాత్రం మూసివుంది. సందులోకివున్న గుమ్మంమాత్రం తెరిచివుంది. గుమస్తాలు పనిచేస్తున్నారు. జనం పనిమీద వచ్చిపోతున్నారు. యువకుడు లోపలకు ప్రవేశించాడు.

“రా బాబూ” ఆహ్వానించాడు ధర్మచంద్.

“పని వత్తిడితో రాలేకపోయాను.” క్షమాపణ చెప్పుతున్నాడు యువకుడు.

“ఫరవాలేదు. నాకందరి మొహాలూ గుర్తే. రసీదు పట్టుకెళ్ళు” అని గుమాస్తా వైపు సంజ్ఞ చేశాడు. సొరుగులో గుర్తుగా పెట్టుకున్న ఆ నగ తూకంవేసి ఎంతవుందో చెప్పాడు. యువకుడికి సేర్‌జీ నిజాయతీ పట్ల నమ్మకం కలిగింది.

“సరిగ్గా మా ఆడవాళ్ళు ఎంత చెప్పారో అంతే వున్నది” సంతోషంతో అన్నాడు.

“అందరికీ ఆ లక్ష్మీదేవి ప్రసన్నం. అంతకన్నా మరేంలేదు” అని మళ్ళీ గుర్తుగా దాచాడు గొలుసు. రసీదు వ్రాశాడు గుమాస్తా. సంతకం పెట్టాడు యువకుడు.

“మొదటినెల వడ్డీ మూడు రూపాయల బేడ, రసీదుకు బేడ మొత్తం మూడుంపావలా యివ్వండి” గుమాస్తా చెయ్యి జాపాడు.

“అదేమిటీ అంతవడ్డీ ఎలా అవుతుంది?”

“అవును బాబూ. రూపాయికి నాలుగు దమ్మిడీలు. అందరి దగ్గరా అదే. ఇందులో ఎక్కువ దమ్మిడీ తీసుకోవడం లేదు” గుమాస్తా సమాధానమిచ్చాడు. యువకుడు సేర్‌వైపు చూశాడు. అవునన్నట్లు ధర్మానంద్ తలవూపి లక్ష్మీదేవి పటం వైపు చూసి “అంతా ఆ అమ్మ ఆజ్ఞ” అని దణ్ణం పెట్టాడు.

మరి పాతిక దాటితే ఏడాదికి 100కి 6-4-0 అని రసీదు కాగితం వెనుకవైపున వ్రాసి వున్నదే. ఇదేమిటి? మీరు వసూలు చేసే లెఖ్ఖ ప్రకారం 100కి 25 రూపాయ లవుతున్నదే! పైగా రసీదుమీద నిన్నటి తేదీ వేశారే” అమాయికంగా అడిగాడు. ధర్మచంద్ నవ్వాడు. అతను శాంతస్వరూపుడు. కోపం ఎందుకు వస్తుంది?

“ఆ రోజు నువ్వు రసీదు పట్టుకెళ్ళలేదు. ఇప్పుడు వెనకతేదీ వేయాలంటే రసీదు పుస్తకంలో నంబర్ల చిక్కువస్తుంది. అందుకని మొదట నెల వడ్డీ, రసీదుకు బేడ, లోపాయకారీగా ఇచ్చేసి నిన్నటినుంచి ప్రారంభమైనట్లుగా రసీదు పట్టుకెళ్లు” ధర్మచంద్ చాలా శాంతంగా వివరించాడు.

“పోనీ యివ్వాళ తేదీ వెయ్యొచ్చుగా?”

“ఇవ్వాళ సెలవరోజు. పని జరగకూడదు. కాని జనం చూశావుగా ఎలా వస్తున్నారో. పాపం డబ్బు అవసరం. ఈ ముసలి పీనుగు చేయగలిగిన సేవ చెయ్యాలి కదా! పైగా లక్ష్మీదేవి తీసుకోమంటూంటే వద్దని ఎలా అనగలను! అందుకని నిన్నటి తేదీ వేశాను.” మళ్ళీ చెప్పాడు.

“అయితే, రసీదుకి బేడ యివ్వమని ఎక్కడా వ్రాసి లేదే?”

“అది ఆచారం బాబూ. అది మాకక్కర్లేదు. ప్రతి ఆదివారం పేదవాళ్ళకి దమ్మిడీల లెఖ్ఖన పంచేస్తూంటాను.” యువకుడు జేబులో డబ్బు తీసియిచ్చి రసీదు పట్టుకెళ్ళి పోయాడు.

* * *

రెండు నెలలు గడిచాయి. నగమీద వడ్డీ పెరిగింది. ఆ యువకుడు వచ్చి కట్టలేదు. సేర్ ధర్మచంద్ “రూల్సు” ప్రకారం నడిచేవాడు గనుక అర్థణా పోస్టుకార్డు వ్రాసి పారేశాడు. జవాబు లేదు. మనిషి రాలేదు. మరో నాలుగు నెలలు గడిచాయి. అకస్మాత్తుగా బంగారం ధర పడిపోయింది విపరీతంగా. రూల్సు ప్రకారం కొంత డిపాజిట్ చేయమని వుత్తరం వ్రాశాడు మళ్ళీ. కాని జవాబులేదు. మరోనెల గడిచింది, ధర యింకా పడిపోయింది. ధర్మచంద్ యీమాటు రిజిస్టరు వుత్తరం వ్రాశాడు. నలభై రూపాయలు డిపాజిట్ చేసి బకాయి వడ్డీ చెల్లించకపోతే నగ వేలం వేస్తామని తెలియబరచాడు. దానికీ జవాబులేదు. ధర్మచంద్ పత్రికలో ఒకరోజు “వేలం” కాలం కింద నాలుగు పంక్తులు వ్రాయించాడు.

వేలం ప్రారంభమైంది. మొత్తం నాలుగు నగలు కాబట్టి ఎవరూ ఉత్సాహంగా రాలేదు. అయినా ఎవరికాసక్తి! ధర్మచంద్ కొట్టు చుట్టు పక్కల కొట్లవాళ్లు నలుగురు, మరోయిద్దరు పెద్ద మనుష్యులు, వేలం తనిఖీచేసే ఒక గవర్నమెంటు వుద్యోగి వచ్చారు. మొదటి మూడు నగల వేలం అయింది, చివరది ఆ యువకుడి గొలుసు. ఎవరో 80 రూపాయలకు పాడారు.

"చాలా అన్యాయం. నాడబ్బు ఎంతిచ్చాను! 150 రూపాయలు! వడ్డీ బకాయి గవర్నమెంటు లెక్కప్రకారం ఆరురూపాయలదాకా రావాలి. ప్రస్తుతం దీని మార్కెట్ విలువ 160 వుంటుంది. అయ్యా, పాడండిబాబూ" అని ప్రోత్సాహ పరిచాడు. ఎవరో 100 అన్నారు.

"అంతేనా ఆఖరుసారికూడా పాడండిబాబూ, నాకు రావలసిన డబ్బుకంటె దమ్మిడీ ఎక్కువవద్దు. అదే కష్టమైపోతోందే!"

"నూట యాభైఅగు" ఒకమూల ఒక గొంతు వినిపించింది. అందరికీ ఆశ్చర్యం కలిగింది. అందరి తలకాయలు అటువైపు తిరిగాయి. ఎవరో ఒక గెడ్డంసాహెబుగారు. ధర్మచంద్ ఖంగారుపడ్డాడు. ఒక మూల వున్న వకొకడికి ఏదో సంజ్ఞ చేశారు ఎవరికీ కనపడకుండా. 'నూట ఎనభై' మరో గొంతుక! ఆ సాహెబ్‌గారు చలించలేదు

"నీకు రావలసిన దానికంటె దమ్మిడీ ఎక్కువ వద్దన్నావుగా. కను నగ నాకిచ్చెయ్యి" అన్నాడు.

"అఁ...ఏ...దో అన్నాను. కాని లక్ష్మీదేవి నడిచి వస్తూంటే తలుపు గడియపెట్టనా! దోషం! దోషం! వద్దనకూడదు. బాగా పాడండి బాబూ" అని మొదలెట్టాడు ధర్మచంద్.

"ఆయన తనకు రావలసింది తీసుకుని తలిమాది ఎలాగూ నగ యజమానికిచ్చేయాల్సిందేగా! కాబట్టి పాడండి సాహేబ్‌గారూ! ధర్మచంద్ తినేది అక్రమంగా ఒక్క దమ్మిడీ లేదు. నేను సాక్ష్యంలేనూ! ఎంతకు ఖరీదయింది నేను చూడటం లేదూ" గవర్నమెంటు ఉద్యోగి అన్నాడు.

"సేఠ్ ధర్మచంద్ శాంతారాం! నీ సొరుగులు సోదా చేయాలి" సాహెబ్‌గారు గెడ్డం తీసేశాడు. ఆశ్చర్యం! ఆ యువకుడు! చకచక ముందుకు నడిచాడు. ధర్మచంద్ వణికిపోయాడు. గవర్నమెంటు ఉద్యోగి నిలబడి శాల్యూట్ చేశాడు. ఎక్కడివాళ్ళక్కడ తెల్లబోయి నుంచున్నారు. మరో నలుగురు ఇన్‌స్పెక్టర్లు ఆకస్మాత్తుగా ప్రవేశించారు.

"నీవాళ్ళని నలుగురిని కట్టుకుని తప్పుడు వేలం వేసి నగ కొట్టేద్దామని ఎత్తువేశావా! రూపాయికి నాలుగు దమ్మిడీలు వసూలు చేస్తావా? రసీదుకు బేడ లాగుతున్నావా! రసీదులు లేకుండా నోట్ బుక్కుల్లో వ్రాసుకొని కొందరికి అప్పునిస్తున్నావా! నెలవరోజున ఆ సందుగుమ్మం తీసివుంచి వ్యాపారం చేస్తూ వెనుకటి రోజు తారీఖులు వేయిస్తున్నావా! ధర్మచంద్ శాంతారాం! ధర్మప్రభువువి! పేదలకు దమ్మిడీలు దానంచేస్తావుటూవ్! శాంతమూర్తివి! నిజాయితీపరుడివి! ఈ నోట్‌బుక్కులన్నీ ఏమిటి! ఈ లెక్కలన్నీ ఏమిటి?" హడావిడిగా సోదాచేస్తూ అరుస్తున్నాడు ఆ యువకుడు.

ఇనప్పెట్టె దగ్గరకొచ్చి "ఇది తియ్యి" ఆజ్ఞాపించాడు. ధర్మచంద్ గజగజ వణుకుతూ తీసేశాడు. ఆ యువకుడు మనసులో గుర్తుపెట్టకున్న కొన్ని నగలను పైకితీశాడు. వాటికి కాగితాలు చుట్టివున్నాయి. వాటిమీద యజమానిపేరు, అడ్రసువున్నాయి.

"ఈ ఎనిమిది నగలకూ రసీదులున్నాయా నీ పుస్తకంలో?" అని బల్లమీద రసీదు పుస్తకం తీశాడు. ధర్మచంద్ నోటంట మాటరాలేదు.

"సేఠ్ ధర్మచంద్ శాంతారాం! నువ్వు నిజాయితీపరుడివి. మాటతప్పవు. అందుకనే నిన్నిప్పుడు వెంట తీసుకెళ్ళటం లేదు. ఫోంచేసి మధ్యాహ్నం తీరికగా కోర్టుకురా." కొట్టుగుమాస్తాలను, ఆ నగలను, నోట్‌బుక్కులను వెంట తీసుకెళ్ళిపోయాడు.

---

మద్రాసు, డిసెంబరు 28: నగరంలోని 1000 మంది వడ్డీవ్యాపారలూ, 800 మంది తాకట్టు వ్యాపారులూ యివాళ తమ దుకాణాలు మూసేశారు. రేపుకూడా మూసేస్తారు. వడ్డీకి డబ్బు అప్పిచ్చే 200 మంది ముల్తానీవాళ్లు కూడా యీ హర్తాల్‌లో చేరారు. ప్రభుత్వం తలపెట్టిన "వడ్డీ వ్యాపారులచట్టం" తమకు నచ్చలేదనీ, అసమ్మతి సూచకంగా యీ హర్తాల్ జరిపామని, వాళ్ళ ప్రతినిధి ఒకరన్నారు.